క్లుప్తంగా

శిర నుంచి మడకశిరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం

మడకశిర: శిర నుంచి మడకశిరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినట్లు ఆర్టీసీ డీఎం రామసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు రోజూ ఉదయం 5 గంటలకే శిర నుంచి బయలుదేరి మడకశిరకు చేరుకుంటుందన్నారు. అగళి, రొళ్ల మండలాల ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగుల సౌకర్యార్థం బస్సును నడుపుతున్నట్లు తెలిపారు.

ఎంపీడీఓగా మమతాదేవి



బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓతో కార్యాలయ సిబ్బంది

సోమందేపల్లి: ఎంపీడీఓగా మమతాదేవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సరస్వతి ఇటీవల బదిలీ కాగా ధర్మవరంలో పనిచేస్తున్న మమతాదేవిని ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని నూతన ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ భీమలింగేశ్వర, కార్యదర్శులు రామాంజినేయులు, శైలజా తదితరులు పాల్గొన్నారు.

నేడు వాల్మీకి జయంతి ఉత్సవాలు

పెనుకొండ రూరల్: పట్టణంలోని బోయగేరిలో వాల్మీకి విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, మండలాల కన్వీనర్లు బోయ నరసింహులు, సుధాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

హిందూపురంలో...

హిందూపురం: వాల్మీకి జయంతిని పురస్కరించుకుని పట్టణంలో పెద్దఎత్తున ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వాల్మీకి సంఘం సభ్యులు తెలిపారు. స్థానిక చిన్నమార్కెట్ పాట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నుంచి మహిళలు జ్యోతులతో బోయపేటలోని వాల్మీకి విగ్రహం వరకు ర్యాలీ తరలివెళ్లనున్నారు. అలాగే వాల్మీకి ఆలయం వద్ద పునరుద్ధరణ పనులు చేపడుతున్న ప్రదేశంలో ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహానికి పూజలు చేసి జ్యోతులు సమర్పిస్తున్నట్లు కమిటీ సభ్యులు చెప్పారు.

అమరాపురంలో...

అమరాపురం: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో గురువారం నుంచి మూడు రోజుల పాటు వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వాల్మీకి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాలకు వాల్మీకి కులస్తులతో పాటు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని వారు కోరారు.

'సాగునీటి' రాజకీయం షురూ !

- నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు
- ఆయకట్టుదారులతో ఓటర్ల జాబితాలు తయారు చేస్తున్న అధికారులు
- సాగునీటి సంఘాలపై అధికార పార్టీ నాయకుల కన్ను



మడకశిరలోని మైనర్ ఇరిగేషన్ కార్యాలయం

మడకశిర: నియోజకవర్గంలో సాగునీటి సంఘాల ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. నవంబర్ 18న సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా నియోజకవర్గంలో 47 సాగునీటి సంఘాలు ఉన్నాయి. వాటి ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా అమరాపురం మండలంలో అత్యధికంగా 14 సాగునీటి సంఘాలు ఉన్నాయి. అతి తక్కువగా రొళ్ల మండలంలో 5 సాగునీటి సంఘాలు మాత్రమే ఉన్నాయి. మడకశిర మండలంలో 12, అగళి మండలంలో 7, గుడిబండ మండలంలో 9 సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాలకు పగడ్బందీగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు.

ఓటర్ల జాబితా తయారు

వచ్చే నెలలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మైనర్ ఇరిగేషన్ అధికారులు ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నారు. సాగునీటి సంఘాల వారీగా ఓటర్ల జాబితాలు తయారవుతున్నాయి. ఓటర్ల జాబితాల్లో అర్హులైన రైతుల పేర్లను చేర్చడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆయా సాగునీటి సంఘాల పరిధిలో ప్రధానంగా ఆయకట్టుదారులే ఓటర్లుగా ఉంటారు. వేరే వారికి అవకాశం ఉండదు. దీంతో అధికారులు పగడ్బందీగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నారు. సాగునీటి సంఘాల వారీగా భూ రికార్డులను పరిశీలించి ఆయకట్టుదారులైతేనే ఓటర్ల జాబితాల్లో చేర్చడానికి చర్యలు తీసుకుంటున్నారు.

సాగునీటి సంఘాలపై అధికార పార్టీ నేతల కన్ను

నియోజకవర్గంలోని సాగునీటి సంఘాలకు వచ్చే నెలలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అప్పుడే అధికార పార్టీ నేతలు వాటిపై కన్నేశారు. ఎలాగైనా సరే సాగునీటి సంఘాలను తమ గుప్పెట్లో పెట్టుకోవాలని భావిస్తున్నారు. ప్రధానంగా సాగునీటి సంఘాల ఆధ్వర్యంలోనే చెరువుల అభివృద్ధి పనులు చేస్తారు. దీంతో చెరువుల అభివృద్ధికి వచ్చే నిధుల ద్వారా లబ్ధిపొందాలనే ఆలోచన అధికార పార్టీ నాయకుల్లో ఉంది. ఈ ఎన్నికల్లో తమ మార్క్‌ను ఉపయోగించి సాగునీటి సంఘాలన్నీ కై వసం చేసుకోవాలని కూటమి నాయకులు అప్పుడే ప్రణాళికలు మొదలుపెట్టారు. దీతో ఈ ఎన్నికలు సజావుగా జరుగుతాయో? లేదో? అనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. అధికారులు చొరవ తీసుకుని సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

మడకశిర నియోజకవర్గంలో సాగునీటి సంఘాలు ఇలా..	
మండలం	సాగునీటి సంఘాల సంఖ్య
మడకశిర	12
అమరాపురం	14
గుడిబండ	09
రొళ్ళ	05
అగళి	07
మొత్తం	47

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

ప్రభుత్వ ఆదేశాల మేరకు సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. 47 సాగునీటి సంఘాలకు సంబంధించిన ఓటర్ల జాబితాలను తయారు చేస్తున్నాం. ఆయకట్టుదారులే ఓటర్లుగా ఉంటారు. పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఓటర్ల జాబితాలను పగడ్బందీగా తయారు చేస్తున్నాం. త్వరలోనే ఓటర్ల జాబితాలను ప్రకటిస్తాం. అనర్హులుంటే వారిని ఓటర్ల జాబితాల నుంచి తొలగిస్తాం.

– భార్గవ్, ఏఈ, మైనర్ ఇరిగేషన్‌శాఖ

నూతన మద్యం షాపులు ప్రారంభం

పెనుకొండ: పట్టణంలో బుధవారం నూతన మద్యం షాపులను బుధవారం ఆ షాపును యజమానులు ప్రారంభించారు. అయితే ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.99 మద్యం బాటిల్, ఇతర తక్కువ ధరల ప్రస్తావన లేకపోవడంతో మద్యం ప్రియులు ఉసూరుమన్నారు. మరో 2 నెలల్లో పాలసీ అమలవుతుందని పలువురు పేర్కొనగా.. ఇది ముమ్మాటికీ మోసమేనని పలువురు మద్యం ప్రియులు వాపోయారు.

జేడీఎస్ సీనియర్ నేత కన్నుమూత



నరసారెడ్డి (ఫైల్)

పావగడ: స్థానిక జేడీఎస్ సీనియర్ నేత ఎల్ హెచ్ నరసారెడ్డి (75) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. తాలూకాలోని లింగదహళ్లి గ్రామానికి చెందిన నరసరెడ్డి గతంలో పలు రాజకీయ పదవులు చేపట్టారు. పీఎల్‌డీ బ్యాంకు, ఏపీఎంసీ అధ్యక్షుడిగా పదవులు అలంకరించి ఎన్నో అభివృద్ధి పనులు నిర్వహించారు. అదే విధంగా కర్ణాటక మార్కెటింగ్ ఫెడరేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆయన మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, తాలూకా జేడీఎస్ అధ్యక్షుడు ఎస్‌ఏ ఈరణ్ణ, జిల్లా జేడీఎస్ అధ్యక్షుడు ఆర్సీ అంజినప్ప, బలరామిరెడ్డి, సాగడు వెంకటేశ్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు.

ఓటు నమోదు చేసుకోండి

హిందూపురం: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో జరగబోయే పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల కోసం ఆయా జిల్లాలోని పట్టభద్రులు, సచివాలయ ఉద్యోగులు, దివ్యాంగ ఉద్యోగులు, దివ్యాంగ పట్టభద్రులు ఫారమ్ 18లో దరఖాస్తు ద్వారా ఓటు నమోదు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామవార్డు సచివాలయ దివ్యాంగుల ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అశ్వర్థ తెలిపారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలను, సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిన వారికే తమ సంఘం మద్దతు ప్రకటిస్తుందన్నారు.

ముగిసిన దసరా ఉత్సవాలు



గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: మండలంలోని దేమకేతేపల్లిలో వెలసిన చౌడేశ్వరీదేవి ఆలయంలో దసరా ఉత్సవాలు ముగిశాయి. శరన్నవరాత్రులలో భాగంగా వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం రాత్రి నిర్వహించిన కరగం ఉత్సవంతో శరన్నవరాత్రులు ముగిసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. హిందూపురానికి చెందిన వ్యక్తి కరగం నెత్తిమీద పెట్టుకొని నృత్యం చేశారు. భక్తులు అమ్మవారికి కొలుస్తూ గోవింద నామస్మరణలు చేశారు. ఈ ఉత్సవం అర్ధరాత్రి వరకూ కొనసాగింది.

నష్ట నివారణకు కృషి చేయండి

- పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్



పరిగి చెరువును పరిశీలిస్తున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు

పరిగి: తుపాను వల్ల కలిగే నష్ట నివారణపై క్షేత్రస్థాయిలో అధికారులంతా కృషి చేయాలని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వరులుతో కలిసి పరిగి మండలంలో తుపాను ప్రభావిత ప్రాంతాలు, వరద ఉధృతి ప్రవాహ ప్రదేశాలతో పాటూ జయమంగళి నది పరివాహక ప్రాంతమైన శ్రీరంగరాజుపల్లి, పరిగి చెరువును పర్యవేక్షించారు. ప్రధానంగా జయమంగళి నదిపై నిర్మించిన కాజ్‌వేపై ప్రజల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించారు. నీటి ప్రవాహ ప్రదేశాల, నిల్వ ఉన్న ప్రాంతాలలో ప్రజల సందర్శనలపై నిషేధాజ్ఞలు పెంచాలన్నారు. అలాగే ముంపునకు గురైన కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. దీనికి తోడు ఆహార పదార్థాలతో పాటూ తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలను కల్పించాలన్నారు. పరిగి చెరువుకు చేరుతున్న వరద నీటి సామర్థం, నిల్వ తదితర అంశాలపై ఆర్డీఓకు రాష్ట్ర రైతు సంఘం నాయకులు ధనాపురం వెంకట్రామిరెడ్డి, కొండూరు నవీన్, గణేషప్ప తదితరులు వివరించారు. ఏదైనా ఇబ్బందులు తలెత్తితే టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. తహసీల్దారు హసీనా సుల్తానా, ఎంపీడీఓ శ్రీధర్, ఎస్‌ఐ రంగడుయాదవ్, ఇరిగేషన్ శాఖ డీఈ లక్ష్మీనారాయణ, ఆర్‌ఐ సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లిన ఆటో



ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లిన ఆటో

మడకశిర: ఓ ఆటో ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. వివరాల్లోకెళితే.. పట్టణంలోని రాజీవ్‌గాంధీ సర్కిల్‌లో బుధవారం ఓ ఆటోను పార్కింగ్ చేశారు. ఆ ప్రాంతంలో దాదాపు 10 అడుగుల లోతులో ముళ్ల పొదలు ఉన్నాయి. పార్కింగ్ చేసిన ఆటో ఉన్న ఫళంగా ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఎవరైనా ఆటోను ముళ్ల పొదల్లోకి తోసేశారా? లేదా? అనుకోకుండా జరిగిందా? అనే విషయం తెలిడం లేదు.

యత్తప్పస్వామికి క్షీరాభిషేకం



అలంకరణలో యత్తప్పస్వామి

రొళ్ల: మండల పరిధిలోని జీజీ హట్టి గ్రామంలో వెలసిన యాదవుల ఆరాధ్య దైవం యత్తప్పస్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం వైభవంగా స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఉదయాన్నే యత్తప్పస్వామి మూల విరాట్‌ను విశేషంగా పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఒక రోజు ముందు దేవుని పేరుతో వదిలేసిన (గోమాతల) ఆవులకు ప్రత్యేకంగా పూజలు జరిపి పాలను సేకరించకుండా వదిలేశారు. అనంతరం ఆవుల మంద వద్దకు ఊరేగింపుగా వెళ్లి భక్తిశ్రద్ధలు పాలను పిండి నైవేద్యం రూపంలో స్వామివారికి సమర్పించి అభిషేకించారు. స్వామివారికి పాలతో అభిషేకించడం వల్ల ఇష్టకార్యం సిద్ధిస్తుందని, ప్రజలు సుఖ సంతోషాలతో ఆరోగ్యంగా ఉంటారని గ్రామస్తుల నమ్మకం.

నేడు పాలుపోసే పండగ వేడుకలు..

మండలంలోని జీజీ హట్టి గ్రామంలో వెలసిన యాదవుల ఆరాధ్య దైవం యత్తప్పస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి 'పాలు పోసే పండగ ' పూజ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు తదితరులు కోరారు.

అదుపు తప్పి వాహనం బోల్తా



హెచ్‌డీ హళ్లి సమీపంలో బోల్తా పడిన ఐచర్

అగళి: మండల పరిధిలోని ఉల్లేఖేర గ్రామ సమీపంలో ఐచర్ అదుపు తప్పి బోల్తా పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... ఐచర్ వాహనం పావగడ నుంచి శిర వైపునకు వెళ్తోంది. అయితే మండల పరిధిలోని ఉల్లేఖేర గ్రామం సమీపం హైవే రోడ్డులో వర్షం కురుస్తున్న సమయంలో మలుపు కనబడకపోవడంతో ఐచర్ బోల్తా పడింది. గతంలో అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాతపడిన విషయం తెలిసిందే. పోలీస్ అధికారులు సంబంధిత హైవే అధికారులతో చర్చించి రహదారిని మలుపు లేకుండా పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

విస్తారంగా వర్షాలు



లేపాక్షి: బురదమయమైన బైరాపురం రోడ్డు



గుడిబండ: రొళ్ల ప్రధాన రహదారిపై పారుతున్న వంక



చిలమత్తూరు: జలకళను సంతరించుకున్న కమ్మయ్యగారిపల్లి చెరువు

మడకశిర: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్నాయి. ఫలితంగా జనజీవనం స్తంభించింది. మడకశిర నియోజకవర్గంలో మంగళవారం రాత్రి 101 మి.మీ వర్షపాతం నమోదైంది. మడకశిర మండలంలో 20.8, అమరాపురం మండలంలో 11.4, గుడిబండ మండలంలో 28.6, రొళ్ల మండలంలో 15.4, అగళి మండలంలో 24.8 మి.మీటర్ల చొప్పున వర్షం కురిసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ వర్షాలు పత్తి, వేరుశనగ, మిరప, పట్టు రైతులకు చాలా ఇబ్బందికరంగా మారాయి.

పావగడ: తుపాను ప్రభావంతో తాలూకా వ్యాప్తంగా రెండు రోజులుగా జడి వాన కురుస్తోంది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకూ జడి వాన కురిసింది. ఇంకా 5 రోజులు వానలు ఉండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వేరుశనగ పంట చేతి కందుతున్న సమయంలో వానలు పట్టుకుని తొలగించిన వేరుశనగ పంట చేలల్లోనే ఉండి వానకు నాని వేరుశనగ కాయలు బూజు పట్టి మొలకెత్తున్నాయి.

రొద్దం: తుపాను కారణంగా మండల వ్యాప్తంగా బుధవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. రొద్దం పెద్దచెరువులోకి మూడు నెలలకు సరిపడ వర్షపు నీరు చేరిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. రొద్దం పెన్నానదిలోకి నీరు చేరాయి.

లేపాక్షి: లేపాక్షి మండల వ్యాప్తంగా సోమవారం నుండి ఎడతెరిపి లేకుండా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రోడ్లన్నీ చిత్తడి చిత్తడిగా మారాయి. ముఖ్యంగా బైరాపురానికి రోడ్డు బురదమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

కూలిన ఇళ్లు

మండలంలోని కంచిసముద్రం పంచాయితీ మామిడిమాకులపల్లి గ్రామానికి చెందిన హరిజన నారాయణప్పకు సంబందించిన పశువుల ఇళ్లు జడివానకు పడిపోయింది. రోజూ రాత్రి పశువులను ఆ ఇంట్లోనే కట్టేసే వాడని అయితే బుధవారం సాయంత్రం వర్షానికి తడిసి పడిపోయిందన్నారు. ఆ సమయంలో పశువులు, మనుషులుగాని లేకపోవడంతో ప్రమాదం తప్పిందన్నారు.

చిలమత్తూరు: తుపాను ప్రభావంతో మండలంలో ఎడతెరపిలేని వర్షాలు కురుస్తున్నాయి. మరో రెండు రోజులు ఇలానే వర్షాలు కొనసాగితే పంటల పరిస్థితి ఏమిటా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సోమందేపల్లి: మండల వ్యాప్తంగా వర్షాలు బుధవారం జోరుగా కురిశాయి. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. సోమందేపల్లితో పాటు పాపిరెడ్డిపల్లి చెరువులు మరువ పారాయి.



రొద్దం సమీపాన ఉధృతంగా ప్రవహిస్తున్న వంక



పరిగి చెరువుకు వచ్చి చేరుతున్న వరద నీరు

పెనుకొండ: పట్టణంలో బుధవారం రోజంతా వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, కూలీలు తీవ్ర అవస్థలు పడ్డారు. భారీ వర్షంతో నియోజకవర్గంలోని పెనుకొండ, సోమందేపల్లి, పాపిరెడ్డిపల్లి, నలగొండ్రాయనిపల్లి, బ్రహ్మసముద్రం తదితర గ్రామాల చెరువులు నిండిపోయాయి.

గుడిబండ: మండల వ్యాప్తంగా రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వంకలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. ప్రధాన రహదారులు జలమయమయ్యాయి.

పరిగి: మండలంలోని జయమంగళి నదికి వరద ఉధృతి భారీగా పెరుగుతోంది. దీంతో పరిగి చెరువుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మండలంలో బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది.కర్ణాటకలోనూ కురుస్తున్న వర్షాలతో బుధవారం జయమంగళి నదిలో ప్రవాహ ఉధృతి భారీగా పెరిగింది. దీతో శ్రీరంగరాజుపల్లి వద్ద ఉన్న పాయకట్ట నుంచి పరిగి చెరువుకు నిర్మించిన డైవర్షన్ కెనాల్‌లో ద్వారా వరద నీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తోంది. పాయకట్ట నుంచి దాదాపు 200 క్యూసెక్కుల నీరు పాయకట్ట నుండీ విడుదలవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రవాహం ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు.



పావగడలో జడివాన కురుస్తున్న దృశ్యం



రొద్దం పెద్దకోడిపల్లి వద్ద కంది పంట పొలాల్లోకి చేరుతున్న వర్షపు నీరు



సోమందేపల్లి: మరువ పారుతున్న సోమందేపల్లి చెరువు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ద్విచక్ర వాహనాదారులకు సూచనలిస్తున్న సీఐ రాజ్‌కుమార్

గుడిబండ: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మడకశిర సీఐ రాజకుమార్ బుధవారం గ్రామ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో కలిసి మండలంలోని చెరువులను, కాలువలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టమాట రైతుకు నష్టం





మొలకెత్తిన వేరుశనగను చూపిస్తున్న రైతు పైలప్ప, కోతకు వచ్చిన టమాట తోటలోకి నీళ్లు చేరిన దృశ్యం

మడకశిరరూరల్: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షానికి కోతకు వచ్చిన టమాట పంటలో నీరు ఉండడంతో పండ్ల తొలగించడానికి వీలులేక చెట్లల్లోనే పండ్లు నేల పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో బుధవారం వేకువ జాము నుంచి రోజంతా మోస్తరు వర్షం కురిసింది. వేరుశనగ పంట తొలగించిన రోజు నుంచి వర్షం కురుస్తుండటంతో పొలంలోనే తొలగించిన పంటలో కాయలు తడిసి మొలకెత్తాయని రైతు పైలప్ప ఆవేదన వ్యక్తం చేశారు.